ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి జిల్లా వార్తలు

5★

శుక్రవారం 12 జనవరి 2024

సూపర్‌వైజర్ మృతిపై న్యాయ విచారణ జరిపించాలి 8లో..

విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు 8లో..

సమీపిస్తున్న గడువు..



పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్

శరవేగంగా ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్

954 మంది ఆపరేటర్లు, కార్యదర్శులు పనిలో నిమగ్నం

17 వరకు ప్రక్రియ పూర్తి చేయడమే లక్ష్యం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరు హామీలను అమలు చేస్తామని హామీ ఇచ్చింది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన గ్రామ, వార్డు సభల ద్వారా వచ్చిన దరఖాస్తులను శరవేగంగా ఆన్‌లైన్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 954 మంది కంప్యూటర్ ఆప రేటర్లు, పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు. ఈనెల 17వ తేదీ వరకు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసి, వచ్చే నెలలో దరఖాస్తులపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయనున్నారు. గత నెల 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించిన గ్రామ, వార్డు సభల ద్వారా 2,31,341 దరఖాస్తులు వచ్చాయి. వీట న్నింటినీ కంప్యూటర్లలో నిక్షిప్తం చేస్తున్నారు.

గత నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాం గ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథ కాలతో పాటు పలు పథకాలను అమలుచేస్తామని ప్రక టించింది. మహాలక్ష్మి, గృహజ్యోతి. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, చేయూత గ్యారంటీ పథకాల అమలు కోసం డిసెంబరు 28 నుంచి ఈనెల 6వ తేదీ వరకు 266 గ్రామ పంచాయతీల్లో ఒక మున్సిపల్ కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీల పరిధిలోని 114 డివిజన్లు, వార్డుల్లో నిర్వ హించిన గ్రామ, వార్డు సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. గ్రామాల్లో 1,61,195, పట్టణాల్లో 70,146, మొత్తం 2,31,341 దరఖాస్తులు వచ్చాయి.

ఇవేగాకుండా రేషన్ కార్డులు, ఇతర త్రా గ్రామాల్లో 1,92,072, పట్టణాల్లో 77,389 దరఖాస్తులు వచ్చాయి. మహా లక్ష్మి పథకం ద్వారా మహిళలకు నెలకు 2,500 రూపాయలు వేస్తామని, 500 రూపాయలకే వంట గ్యాస్ ఇస్తామని ప్రకటించింది.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం డిసెంబరు 9వ తేదీ నుంచి అమల్లోకి తీసుకవచ్చింది. గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచితం గా విద్యుత్ సరఫరా చేస్తామని, రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం కింద ఎకరానికి రెండు పంటలకు కలి పి 15 వేలు, కౌలు రైతులకు 15 వేలు, కూలీలకు 12 వేలు ఇస్తామని ప్రకటించింది. ఇంది రమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మిం చుకునే వారికి 5 లక్షలు, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. చేయూత కింద ఇప్పుడు ఇస్తున్న పింఛ న్లను డబుల్ చేస్తామని హామీ ఇచ్చారు.

వచ్చే నెలలో క్షేత్ర స్థాయిలో దరఖాస్తుల పరిశీలన..

ప్రజల నుంచి గ్రామ, వార్డు సభల ద్వారా వచ్చిన దర ఖాస్తులన్నింటినీ ఈనెల 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు 954 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, పంచాయతీ కార్య దర్శులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఐదు గ్యారంటీ పథకాలకు సంబంధించి ఒకే దరఖాస్తు తీసుకు న్నారు. ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసేం దుకు ప్రభుత్వం ప్రజాపాలన పేరిట ఒక వెబ్‌సైట్‌ను రూపొందించింది. ఈ వెబ్‌సైట్‌లో ప్రజాపాలన దరఖాస్తు నమూనాను ఏర్పాటు చేశారు. ప్రజలు ఇచ్చిన దరఖా స్తుల ఆధారంగా ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేస్తు న్నారు. వివరాలు ఆన్‌లైన్ అయిన తర్వాత దరఖాస్తు దారుడి సెల్ ఫోన్‌కు మెస్సేజ్ వస్తుంది. దాని ఆధారంగా నేరుగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు స్టేటస్‌ను చూసుకునే వెసు లుబాటు కల్పించారు.

ప్రస్తుతం తాత్కాలికంగా నిలిపి వేశారు. వచ్చిన మొత్తం దరఖాస్తులన్నింటినీ ఆన్‌లైన్ చేసిన తర్వాత వెబ్‌సైట్‌లో స్టేటస్ చూసుకునే అవకాశం కల్పించను న్నారు. ఏయే పథకం ద్వారా ఎన్ని దరఖాస్తులు వచ్చా యనే విషయం స్థానికంగా తెలియకుండా ఉంది. ఆన్‌లైన్ పూర్తయిన తర్వాత ఏ పథకానికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయనేది రాష్ట్ర స్థాయిలో సాఫ్ట్‌వేర్‌లో గల ప్రత్యేక ఆప్షన్ల ద్వారా వేరు చేయనున్నారు. ఆ తదనంతరం ఫిబ్ర వరి మాసంలో ఆయా పథకాలకు ఎవరు అర్హులు, అనర్హులు ఎవరనే విషయమై క్షేత్రస్థాయిలో పరిశీలన చేయనున్నారు.

ఇప్పటివరకు జిల్లాలోని రామగిరి, సుల్తా నాబాద్, పెద్దపల్లి మండలాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదు పూర్తయ్యింది. ఈనెల 17వ తేదీ నాటికి ఎట్టి పరిస్థితుల్లో పూర్తిచేయాలని కలెక్టర్ ముజ మ్మిల్‌ఖాన్ ఆదేశించగా, అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యామ్ ప్రసా ద్‌లాల్ క్షేత్రస్థాయిలో పర్యటించి వేగవంతం చేస్తున్నారు.

మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు

1. అంతర్గాం	8,077
2. ధర్మారం	17,895
3. ఎలిగేడు	7,404
4. జూలపల్లి	10,175
5. కమాన్‌పూర్	7,939
6. మంథని	13,370
7. ముత్తారం	9,302
8. ఓదెల	14,735
9. పాలకుర్తి	11,801
10. పెద్దపల్లి	20,320
11. రామగిరి	11,089
12. కాల్వశ్రీరాంపూర్	13,616
13. సుల్తానాబాద్	15,472
14. మంథని మున్సిపాలిటీ	4,604
15. పెద్దపల్లి మున్సిపాలిటీ	12,588
16. రామగుండం కార్పొరేషన్	46,857
17. సుల్తానాబాద్ మున్సిపాలిటీ	6,097
మొత్తం	2,31,341

రామగుండం పోలీస్ కమిషనర్ బదిలీ నిలిపివేత



రెమా రాజేశ్వరి

కోల్‌సిటీ, జనవరి 11: రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి బదిలీని ప్రభుత్వం నిలిపివేసినట్టు తెలుస్తున్నది. రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు డీఐజీగా బదిలీ అయ్యారు. రామగుండం కమిషనర్‌గా జోన్-7 జోగులాంబ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఈనెల 3వ తేదిన జీవో వెలువడింది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో రెమా రాజేశ్వరి బదిలీని ప్రభుత్వం నిలిపివేసినట్టు సమాచారం. జోగులాంబ డీఐజీగా ఉన్న చౌహాన్‌కు కూడా విధుల నుంచి రిలీవ్ కాలేదు. ఆమెనే మరికొన్నాళ్లు కొనసాగించాలని భావిస్తున్నట్టు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సమర్థవంతంగా పని చేయడం, లాఅండ్‌ఆర్డర్ విషయంలో కూడా పూర్తిస్థాయిలో పట్టు ఉండడంతో ఆమెను కొనసాగించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది.

పండుగలకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి : సీపీ

కోల్‌సిటీ, జనవరి 11:సంక్రాంతి పండుగ సెలవుల దృష్ట్యా స్వగ్రామాలకు, బంధువుల ఇండ్లకు, విహారయాత్రలకు వెళ్లే వారు చోరీలు కాకుండా అప్రమత్తతో వ్యవహరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఊరికి వెళ్లాల్సి వస్తే విలువైన బంగారు, వెండి ఆభరణాలు లాకర్లలో భద్రపర్చాలని, లేకుంటే ఇండ్లలోని రహస్య ప్రదేశంలో దాచుకోవాలన్నారు. బీరువాతాళాలను ఇంట్లో ఉంచవద్దని, తమతోపాటు తీసుకెళ్లాలన్నారు. సెలవుల్లో బయటకు వెళుతున్నప్పుడు ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టంఉండే విధంగా తాళం, సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సార్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తాళంవేసి ఊరికి వెళ్లే వారు తప్పనిసరిగా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, వారి ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. వాహనాలు ఇంటి ఆవరణలో పార్కు చేసి చైన్‌లతో తాళం వేయాలన్నారు. నమ్మకశక్యమైన వ్యక్తులనే వాచ్‌మెన్లు, సర్వెంట్లుగా నియమించుకోవాలన్నారు. ఇంట్లో స్వీయ రక్షణ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా మొబైల్‌లో మీ ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు గమనించవచ్చునన్నారు. ఇంట్లో లైట్లు వేసి ఉంచాలని, తాళం కనబడకుండా కర్టెన్లు వేయాలన్నారు. ఇంట్లో లేనప్పుడు పని మనుషులు ఉండే రోజూ వాకిలి ఊడ్వమని చెప్పాలని, ఇంటి ముందు చెత్తాచెదారం, పాల ప్యాకెట్లు జమ కాకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో లొకేషన్లు, ట్రావెల్ ప్లాన్లు అప్‌డేట్ చేయవద్దని సీపీ కోరారు.

నేటినుంచి 17 వరకు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

- జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి

పెద్దపల్లి కల్చరల్, జనవరి 11: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జనవరి 12 నుంచి 17 వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, యాజమాన్యం ప్రభుత్వం ప్రకటించిన విధంగా తమ పాఠశాలల్లో విధిగా సెలవులు ప్రకటించాలని జిల్లా విద్యా శాఖ అధికారి డి మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు ఉల్లంఘించి సంక్రాంతి సెలవులలో ఏదేని పాఠశాల నడిపిస్తున్నట్లు దృష్టికి వచ్చినట్లయితే, ఉపాధ్యాయులను పాఠశాలకు రమ్మని ఒత్తిడిచేస్తే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సబ్బితం సర్పంచ్, ఉపసర్పంచ్‌లను సస్పెండ్ చేసిన కలెక్టర్

పెద్దపల్లి రూరల్, జనవరి 11 : మండలంలోని సబ్బితం గ్రామ సర్పంచ్ చుంచు సదయ్య, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌లను కలెక్టర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్బితం గ్రామానికి చెందిన కందుల అశోక్ చేసిన ఫిర్యాదు మేరకు మండల పంచాయతీఅధికారి విచారణ జరిపి సమర్పించిన నివేదిక ద్వారా సర్పంచ్ చుంచు సదయ్య, ఉపసర్పంచ్ మాదాసి శ్రీనివాస్‌లు నిధులు 2లక్షల 2వేల 210 రుపాయలు దుర్వినియోగం చేసినట్లు గుర్తించి కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే అప్పటి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సతీష్, శ్రీనివాస్‌లకు చార్జ్ మెమోలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

జడ్జి మునావర్ హుస్సేన్‌కు సన్మానం



జడ్జిని సన్మానిస్తున్న సంస్థ నిర్వాహకులు

మంథని, జనవరి 11: స్థానిక కోర్టులో బెంచ్ క్లర్క్‌గా పనిచేస్తున్న అన్వర్ హుస్సేన్ కుమారుడు మునావర్ హుస్సేన్ ఇటీవల జడ్జిగా నియామకం కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ జమాతే ఇస్లామీ హింద్ నాయకులు గురువారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నాయకులు అజీంఖాన్, అలీంఖాన్, ఇర్ఫాన్, యాకూబ్, సర్దార్ ఖాన్, వసూద్దీన్, అఫ్జల్, వాజిత్‌అలీ, జమీల్, ఖాజా, రియాసిత్‌అలీలు పాల్గొన్నారు.

జడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా

జ్యోతినగర్, జనవరి 11 : ఎన్టీపీసీ ఈడీసీ మిలీనియం హాలులో గురువారం జరగాల్సిన జడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదాపడింది. జడ్పీటీసీలు, ఎంపీపీలు ఎవరూ సమావేశానికి హాజరు కాలేదు. కోరం లేని కారణంగా సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు జడ్పీ సీఈవో శ్రీనివాస్ ప్రకటించారు.

మిషన్ భగీరథ నీటి విడుదల

ధర్మారం, జనవరి 11: మండల కేంద్రంలో లీకేజీ అయిన మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్ మరమ్మతు పనులు గురువారం రాత్రి పూర్తయ్యాయి. బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అనే కథనం ప్రచురితమైంది. ఎంపీడీవో జయశీల, తహసీల్దార్ రజిత స్పందించి పైపుల లీకేజీ పనులకు మరమ్మతులు చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. దీంతో గురువారం రాత్రి వరకు లీకేజీ మరమ్మతు పనులు పూర్తి చేయించారు.

అవార్డుకు ఎంపిక

రామగిరి, జనవరి 11: మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ అసిస్టెంట్ ప్రొఫెసర్, త్రీడి పెయింటర్ సింగారపు శివరామకృష్ణ మరో అవార్డుకు ఎంపికయ్యారు. భారత్ యూత్‌వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి మాసంలో శివరామకృష్ణకు దేశరత్న అవార్డును న్యూఢిల్లీ జరిగే కార్యక్రమంలో కేంద్రమంత్రి చేతుల మీదుగా అందించనున్నారు. శివరామకృష్ణ అవార్డుకు ఎంపిక కావడంపై కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి అభినందించారు.

నూతన రవాణా చట్టాన్ని నిరసిస్తూ డ్రైవర్ల సమ్మె



రోడ్డుపై బైఠాయించిన లారీ డ్రైవర్లు, ఓనర్లు

కోల్‌సిటీ, జనవరి 11: నూతన రవాణా చట్టాన్ని నిరసిస్తూ గోదావరిఖనిలో లారీ డ్రైవర్లు సమ్మెకు దిగారు. బుధవారం అర్ధరాత్రి నుంచి రామగుండం లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ మోటార్ వర్కర్స్ యూనియన్, లారీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక మున్సిపల్ జంక్షన్ వద్ద రాజీవ్ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ నెల 9వ తేది నుంచి 13వ తేది వరకు బుకింగ్ కూడా నిలిపివేస్తున్నట్టు లారీ యజమానుల సంక్షేమ సంఘం పేర్కొన్నది. ఈ చట్టాన్ని వెంటనే వాపసు తీసుకోవాలని, లారీ డ్రైవర్లతో పాటు సామాన్యులకు కూడా ఎంతో నష్టం చేకూరుస్తుందన్నారు. ఈ నిరసన కార్యక్రమాల్లో డ్రైవర్స్ అసోసియేషన్ ఎండీ రషీద్, ఫినాజ్, లారీ ఓనర్స్ సంక్షేమ సంఘం నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కడారి సంతోష్‌రావు, దామోదర్‌రెడ్డి, బాబురావు, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కూలీలకు పని కల్పించడమే ఈజీఎస్ ఉద్దేశం

- డీఆర్‌డీవో పీడీ శ్రీధర్



ప్రజా వేదికలో మాట్లాడుతున్న పీడీ శ్రీధర్

ఓదెల, జనవరి 11 : గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు నిరుద్యోగ భృతి, చేతినిండా పని కల్పించడమే ఎన్ఆర్ఈజీఎస్ ముఖ్య ఉద్దేశమని డీఆర్‌డీవో పీడీ శ్రీధర్ అన్నారు. గురువారం మండల పరిషత్ ఆవరణలో 14వ, విడత ఉపాధిహామీ ప్రజా వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ 2022 నుంచి 2023 వరకు గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి పనుల్లో ఈసారి ఎలాంటి తప్పిదాలు లేకుండా పనులు నిర్వహించారని తెలిపారు. ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాల్లో కొంత వెసులుబాటు ఉంటుంది కానీ, ఈజీఎస్‌లో అలాంటి వెసులుబాటు ఉండదన్నారు. వచ్చే ఏడాదిలో నిర్వహించే ప్రజావేదిక ఒక ఆదర్శంగా ఉండాలని, గతంలోని పొరపాట్లు ఇక ఉండవని ఆశించారు. వేసవిలో ఉపాధి పనులకు డిమాండ్ ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని 22 గ్రామాల్లో ప్రతి గ్రామానికి 25 మంది చొప్పున తగ్గకుండా కూలీలకు పని, జాబ్ కార్డులు కల్పించాలని కోరారు.

ఎఫ్ఏలకు 1.84 లక్షల జరిమానా

మండలంలోని 22 గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లకు తప్పిదాలు, బాధ్యత రహిత్యానికి నిర్లక్ష్యంగా వ్యవహరించిందుకు 1,84,90రూపాయలు అధికారులు జరిమానా విధించారు. అలాగే గతంలోని 13వ విడతలో భారీగా జరిమానాలకు గురైన వారు మిగతా డబ్బులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రేణుకాదేవి, విజిలెన్స్ అధికారి పంజాల కొమురయ్య, అంబుడ్స్‌మెన్ జిల్లా అధికారి శరత్ కుమార్, ఎంపీడీవో సత్తయ్య, సూపరింటెండెంట్ శ్రీధర్, స్టేట్‌రిసోర్స్‌పర్సన్ రవి, నాగరాజు, జీవన్, పాండురంగ, డీఆర్పీలు సురేష్, సంజీవ్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పోలీసుల సూచనలను పాటించాలి'

మంథని, జనవరి 11: సంక్రాంతి పండగను కుటుంబ సభ్యులు, బంధు మిత్రుల సమక్షంలో పండగ జరుపుకోవడానికి ప్రస్తుతం ఉన్న కిరాయి ఇంటికి తాళం వేసి తమ స్వగ్రామాలకు వేళ్ళ ప్రజలుఇండ్లలో చోరీలకు తావులేకుండా పోలీసులు ఇచ్చే పలు జాగ్రత్తల సూచనలు తప్పకుండా పాటించాలని మంథని ఎస్ఐ సీహెచ్ కిరణ్ కుమార్ సూచించారు. గురువారం స్థానిక మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో ఎస్ఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ-2 రాణి, సిబ్బంది విద్యార్థులకు సైబర్‌క్రైం, గంజాయి వినియోగంతో జరిగే నష్టాలపై అవగాహన కల్పించడంతోపాటు దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగకి ఊరికి వెళ్లాలనుకునే వారు సాధ్యమైనంతవరకు ఇల్లు ఖాళీ చేసి వెళ్ళకుండా, ఇంటి వద్ద ఎవరో ఒకరు ఉండేలా చూసుకోవాలన్నారు. ఒకవేళ ఇంటివద్ద ఎవరిని ఉంచే పరిస్థితి లేకపోతే, పక్క ఇంటివారినైనా తమ ఇంటివైపు ఒక కన్ను వేసి ఉంచమని చెప్పాలన్నారు. ఊరికి వెళ్లేముందు ఇంటిలో ఎక్కువ మొత్తంలో నగదు రూపాయలు, బంగారు ఆభరణాలు ఉండకుండా జాగ్రత్త వహించాలన్నారు.

వడ్డే ఓబన్న జీవితం స్ఫూర్తిదాయకం

- అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ



చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్లు

పెద్దపల్లి కల్చరల్, జనవరి 11 : మహనీయులు వడ్డే ఓబన్న జీవితం స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వడ్డే ఓబన్న జయంతి వేడుకలలో అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్‌తో కలిసి అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం అదనపు కలెక్టర్లు వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా వడ్డే ఓబన్న నిర్వహించిన పాత్ర, ఆయన జీవిత చరిత్రను జిల్లా వెనుకబడి తరగతుల అధికారి చదివి వినిపించారు. అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ మాట్లాడుతూ తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడైన వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని, ఆయన అందించిన స్ఫూర్తిని అందరూ స్మరించుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ మాట్లాడుతూ తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న చరిత్ర చిరస్మరణీయమని, ఆయన జీవితం అందరికీ ఆదర్శమని, ఆయన విలువలు, సూచనలు పాటిస్తూ మెరుగైన సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలన్నారు. మహనీయులు చేసిన గొప్ప పనులను స్మరించుకోవడం వల్ల వారు అందించిన స్ఫూర్తి, విలువలు తెలుస్తాయని అన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ప్రధాన సహచరుడిగా బ్రిటిష్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా చేసిన పోరాటంలో ఆయన పోషించిన పాత్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. స్వార్థ ప్రయోజనాలతో బ్రతికే సమాజంలో ఆనాటి కాలంలోనే ఆయన నిస్వార్థంగా మంచి విలువలను పాటిస్తూ దేశం కోసం పోరాటం చేశారని అన్నారు. ఓబన్న నిరంతరం కష్టపడే తత్వంతో జీవితాంతం చెడుపై పోరాటం చేస్తూ గడిపారని ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకోవాలని తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి జే.రంగారెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, ముఖ్య ప్రణాళిక అధికారి గంప రవీందర్, వడ్డెర సంఘం జిల్లా వైస్‌చైర్మన్ కుంట పోశెట్టి, జిల్లా కార్యదర్శి వోళ్లెపు బాలకృష్ణ, పట్టణ ప్రెసిడెంట్ కొట్టే సమ్మయ్య, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పలువురు బీసీ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఈద' కుటుంబాన్ని పరామర్శించిన పుట్ట మధు

మంథని, జనవరి 11: టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి తల్లి కమలాదేవీ ఇటీవల మృతిచెందగా, బాధితకుటుంబాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తోకలిసి పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు కరీంనగర్‌లో గురువారం పరామర్శించారు. కమలాదేవీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి, ఆమె మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులను ఓదార్చారు. వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, జడ్పీటీసీ గంటా రాములు, తగరం శంకర్‌లాల్, జితేందర్‌రావులు ఉన్నారు.

సెమినార్ బ్రోచర్ ఆవిష్కరణ

రామగిరి, జనవరి 11: మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల మైనింగ్ విభాగం ఆధ్వర్యంలో కోల్‌మైనింగ్ భవిష్యత్‌పై ఈనెల 20న నిర్వహించనున్న సెమినార్‌ను బ్రోచర్‌ను గురువారం కళాశాల ఎదుట ఆవిష్కరించారు. మైనింగ్ ఇంజనీరింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా స్టూడెంట్ చాప్టర్‌ను ప్రారంభోత్సవాన్ని నిర్వహించనున్నారు. అందులో భాగంగా ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి సెమినార్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు జీఎంలు సెమినార్‌ను ప్రారంభించనున్నారు.

'అవిశ్వాస' కలకలం

- జడ్పీ చైర్మన్‌పై అవిశ్వాసానికి సొంత పార్టీ సభ్యుల యత్నాలు

- చెక్ పెట్టేందుకు రంగంలోకి దిగిన మాజీ మంత్రి



మాజీ మంత్రి ఈశ్వర్ నివాసంలో సమావేశమైన జడ్పీ చైర్మన్ మధూకర్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌పై అవిశ్వాసం పెడుతున్నారనే వార్తలు జిల్లాలో రాజకీయంగా కలకలం రేపుతున్నాయి. సొంత పార్టీకి చెందిన కొందరు జడ్పీటీసీ సభ్యులే అవిశ్వాసం పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తుండగా, వారికి చెక్ పెట్టేందుకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ రంగంలోకి దిగారు. చైర్మన్ సొంత నియోజకవర్గ పరిధిలోని ఇద్దరు జడ్పీటీసీ సభ్యులు ఆయనపై అవిశ్వాసం పెట్టేందుకు ఇతర మండలాలకు చెందిన జడ్పీటీసీలను సమీకరించేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం. వారి వెనుక అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన అగ్రనేత ఒకరు ఉన్నట్లు తెలుస్తున్నది. జిల్లాలో 13 గ్రామీణ మండలాలు ఉండగా, 13 మంది జడ్పీటీసీ సభ్యులు ఉన్నారు. వీరిలో 11మంది బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలు పొందగా, ఇద్దరు కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందారు. కమాన్‌పూర్ నుంచి గెలుపొందిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ జడ్పీ చైర్మన్ కాగా, ఎలిగేడు జడ్పీటీసీ మండిగ రేణుక వైస్‌చైర్‌పర్స న్ అయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పుట్ట మధూకర్ మంథని నుంచి పోటీ చేసి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతిలో ఓటమి చెం దారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలను గెలుచుకుని అధికారాన్ని చేపట్టింది. దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి పదవి వరించింది. ఓటమితో మనస్థాపానికి గురైన పుట్ట మధూకర్, ఆయన సతీమణి మంథని మున్సిపల్ చైర్మన్ పుట్ట శైల జ తమ పదవులకు రాజీనామా ప్రకటించారు. విషయం తెలుసుకు న్న పార్టీ అధినేత కేసీఆర్ వారిని ఫామ్‌హౌస్‌కు రప్పించుకుని వారి పదవులకు రాజీనామాలు చేయవద్దని సూచించడంతో విరమించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పెద్దపల్లి జడ్పీటీసీ బండారి రామ్మూర్తి పార్టీని వీడి బీఎస్పీలో చేరగా, పాలకుర్తి జడ్పీటీసీ సభ్యురాలు కందుల సంధ్యారాణి బీజేపీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా రామగుండం నుంచి పోటీ చేశారు. పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించిన ఓదెల జడ్పీటీసీ గంటా రాములు యాదవ్ బీఆర్ఎస్‌లో చేరారు. జడ్పీలో ప్రస్తుతం బీఆర్ఎస్‌కు చెందిన వాళ్లు 10 మంది ఉండగా, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ నుంచి ఒక్కొక్కరు ఉన్నారు.

● మరో ఐదు మాసాలే..

గతనెల 28న జడ్పీ సర్వసభ్య సమావేశం ఉండగా, ప్రజాపాలన గ్రామసభలు అదేరోజు నుంచి ప్రారంభం కానుండడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. ఈనెల 11వ తేదీన తిరిగి నిర్వహించేందుకు సమావేశం ఏర్పాటు చేయగా, జడ్పీటీసీ సభ్యులు ఎవరు కూడా హాజరుకాలేదు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు జడ్పీటీసీలు చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని నిర్ణయం తీసుకుని ఇతరులను సమీకరించేందుకు యత్నిస్తున్నారు. హైదరాబాద్‌కు వెళ్లిన సదరు జడ్పీటీసీ సభ్యులు గురువారం ఉదయం నుంచి ఇతరులను రప్పించేందుకు ప్రయత్నాలు చేశారు. విషయం తెలుసుకున్న చైర్మన్ అప్రమత్తమై మంథని, అంతర్గాం, ఓదెల జడ్పీటీసీ సభ్యులు తగరం సుమలత, ఆముల నారాయణ, గంటా రాములు యాదవ్, ధర్మారం జడ్పీటీసీ సభ్యురాలు పుస్కూరి పద్మజ భర్త జితేందర్‌రావుతో కలిసి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆయన నివాసంలో కలిశారు. అధికార పార్టీకి చెందిన జడ్పీటీసీ సభ్యులకు మాజీ మంత్రి ఈశ్వర్ ఫోన్లు చేశారని తనను కలవాలని, ఎవరు కూడా అవిశ్వాసం పెట్టకూడదని చెప్పినట్లు సమాచారం. అవిశ్వాసం పెట్టేందుకు ఏడుగురు జడ్పీటీసీలు సంతకాలు చేయాలి. ఒకవేళ పెట్టినట్లయితే అవిశ్వాస పరీక్ష సమావేశానికి తప్పనిసరిగా 9మంది జడ్పీటీసీలు హాజరుకావాలి. అవిశ్వాసానికి అనుకూలంగా ఏడుగురు జడ్పీటీసీ సభ్యులు ఓటేస్తే చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గుతుంది. లేనట్లయితే వీగుతుంది. ప్రస్తుతానికి జడ్పీ చైర్మన్ వెంట నలుగురు జడ్పీటీసీలు ఉండగా, అవతలి వైపు ఎందరు ఉన్నారనేది తెలియడం లేదు. చైర్మన్ పదవి ఎవరు ఆశిస్తున్నారనే విషయం కూడా తెలియడం లేదు. జడ్పీ పాలకవర్గం పదవీ కాలం మరో ఐదు మాసాలు మాత్రమే ఉండగా, చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు చర్చనీయాంశంగా మారింది.

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	సినీ ప్లానెట్ - కొంపల్లి
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	ఏషియన్ రాధిక - కాప్రా
ఆర్.కె. - బంజారాహిల్స్	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
గలేరియా - పంజాగుట్ట	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
ఐకాన్ - హైటెక్‌సిటీ	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ సినిమాస్ - చందానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	లక్ష్మీనరసింహ - మియాపూర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
అట్రియమ్ - గచ్చిబౌలి	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎస్2 సోమ - మల్లాపూర్	మూవీటైమ్ - అమీర్‌పేట
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
ఎం.పి మాల్ - కాచిగూడ	టివోలి - సికింద్రాబాద్
జిఎస్ఎమ్ - మదీనగూడ	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
నెక్లెస్ సత్వ - కవాడిగూడ	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	షా షహెన్‌షా - చింతల్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	మూవీమ్యాక్స్ - మౌలాలి
మంత్రామాల్- అత్తాపూర్	జె.పి.సినిమాస్ - చందానగర్
సుధా - శాలిబండ	మరియు
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్	మీ అభిమాన థియేటర్లలో

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


కోల సంతోష్(ఫైల్)

జమ్మికుంట రూరల్, జనవరి 1: జమ్మికుంట మండలం మడిపల్లి రైల్వే గేట్ సమీపంలో గురువారం ఆర్థిక ఇబ్బందులు తాళలేక గుర్తు తెలియని రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. వీణవంక మండలం శ్రీరాములపేట గ్రామానికి చెందిన కోల సంతోష్ (28) కమలాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నా డు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై మడిపల్లి కెనాల్ సమీపంలో ద్విచక్ర వాహనం పార్క్ చేసి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య నాగమణి, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీస్‌లు తెలిపారు.

బీరు సీసాతో దాడి.. ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, జనవరి 11: శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన నిజానపు శివాజీపై బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి బీరు సీసాతో దాడి చేశారు. ఈ ఘటనలో శివాజీ తలకు, చెంపకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది ఈఎంటీ సతీష్‌రెడ్డి, పైలట్ ఖాజా ఖలీల్ లాల్‌లు సంఘటన స్థలానికి చేరుకొని హుజూరాబాద్ ఆస్పత్రికి తర లించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

శంకరపట్నం, జనవరి 11: శంకరపట్నం మండలం కొత్తగట్టుకు చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల సమాచారం మేరకు.. శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన కామెడి సాంబశివరెడ్డి (48) ఈ నెల 10న ఇంటి నుంచి వ్యవసాయ బావి వద్దకు తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఆ సమయంలో హుజూరాబాద్ వైపు నుంచి ఎదు రుగా వస్తున్న సైదాపూర్ మండలం సోమారం గ్రామానికి చెందిన ములు గూరి జాన్ తన బైక్‌ను అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ కరీంనగర్-వ రంగల్ రహదారిపై కొత్తగట్టు శివారులో ఢీ కొట్టాడు. కింద పడిన ఈ సాంబశివారెడ్డికి తల భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొం దుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్లు ఎంపిక పోటీలు

రామడుగు, జనవరి 11: రామడుగు మండల కేంద్రంలో ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి జట్ల ఎంపిక పోటీలు గురువారం నిర్వహించారు. ఈ నెల 17న ఆసిఫాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఇక్కడ ప్రతిభ చాటిన విద్యార్థులను ఎంపిక చేశారు. పోటీలను స్థానిక సర్పంచ్ పంజాల ప్రమీల ప్రారంభించారు. కార్యక్రమంలో చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలలో చోరీ

జగిత్యాల టౌన్, జనవరి 11:జగిత్యాల జిల్లా కేంద్రంలోని పురాణి పేటలో చోరీ జరిగింది. గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి అర తులం బంగారంతో పాటు రూ. 5 వేల నగదును అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పురాణి పేటకు నోముల సాగర్ కుటుంబ నెల రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి అమెరికాకు వెళ్లి గురువారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటి తలుపులకు ఉన్న తాళం పగులగొట్టి ఉండడం చూసి దొంగతనం జరిగినట్లుగా గుర్తించారు. దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువా తాళాలు పగులగొట్టి విలువైన వస్తువులతో పాటు బంగారం, నగదు అపహరించుకవెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. వేలి ముద్రలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నటేష్ పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురు డీబార్

గణేశ్‌నగర్, జనవరి 11: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ ఒకటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం నలుగు రు విద్యార్థులను డీబార్ చేసినట్టు శాతవాహన యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వి శ్రీరంగ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో సెమిస్టర్ పరీక్షలో కరీంనగర్‌లోని ట్రినిటి డిగ్రీ కళాశాలలో ఇద్దరు, వికాస్ డిగ్రీ కళాశాలలో ఒకరు, అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల లో ఒకరు మొత్తం నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు తెలిపారు.

యువత దేశసేవలో పాల్గొనాలి

- ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య సంకసాల మల్లేష్



శిక్షణా శిబిరానికి ఎంపికైన వలంటీర్లతో వీసీ ఆచార్య సంకసాల మల్లేష్

గణేశ్‌నగర్, జనవరి 11: జాతీయ సాహస శిక్షణ శిబిరాల్లో యువత పాల్గొని మానసిక, శారీరక దృఢ సంకల్పంతో దేశ సేవలో పాల్గొనాలని శాతావాహన యూనివర్సిటీ(ఎస్‌యూ) ఉపకులపతి ఆచార్య సంకసాల మల్లేష్ పిలుపునిచ్చారు. హిమాచల్‌ప్రదేశ్‌లో (నార్కండ) లోని అటల్ బిహారి వాజ్‌పేయి పర్వతారోహణ సంస్థలో శిక్షణ శిబిరానికి ఎంపికైన పదిమంది వలంటీర్లు తమ శిక్షణను పూర్తి చేసుకుని వచ్చిన సందర్భంగా వీసీ వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ఇంకా ఇలాంటి శిక్షణ శిబిరాల్లో పాల్గొని మానసిక, శారీరక దృఢ సంకల్పంతో దేశ సేవలో పాత్రులుగా కావాలని పిలుపునిచ్చారు. జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ ఈ మనోహర్ మాట్లాడుతూ వలంటీర్లు పర్వతారోహణ, ఇతర సాహస కార్యక్రమాల్లో శిక్షణ తీసుకున్నారని వీరు శాతవాహన యూనివర్సిటీలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులని, మంచి భవిష్యత్ ఉందని తెలిపారు. కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్ శిక్షణ శిబిరం కంటిన్జెంట్ లీడర్ శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు విజయ ప్రకాష్, డాక్టర్ తిరుపతి, డి విజయ్ కుమార్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎక్స్‌కావేటర్ స్వాధీనం

శంకరపట్నం, జనవరి 11: శంకరపట్నం మండలం మక్త గ్రామ గుట్ట నుంచి అక్రమంగా మట్టి తవ్వుతున్న ఎక్స్‌కావేటర్‌ను గురువారం స్వాధీనం చేసుకున్నామని తహసీల్దార్ అనుపమ చెప్పారు. వెంచర్లకు ఎలాంటి అనుమతి లేకుండా మక్త గుట్ట నుంచి మట్టి తరలిస్తున్న ఎక్స్‌కావేటర్‌ను పట్టుకొని కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని తెలిపారు.

వృద్ధురాలిపై అత్యాచారం ఘటనలో ఒకరి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్

చందుర్తి, జనవరి 11: చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులోని శ్మశాన వాటిక వద్ద వృద్ధురాలిపై అత్యాచారం ఘటనలో ఒకరిని అరెస్టు చేసినట్లు చందుర్తి సీఐ కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 9న కట్టలింగంపేట గ్రామానికి చెందిన ఆవునూరు తిరుపతి అనే వ్యక్తి ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని బలవంతంగా తన ఆటోలో ఎక్కించుకొని లింగంపేట శివారుకు తీసుకెళ్లి ఆటోలో అత్యాచారం చేశాడు. తిరిగి ఆటోలో లింగంపేట బస్టాండ్ వద్ద వదిలిపెట్టి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం నిందితుడు సనుగుల నుంచి వేములవాడ వెళుతున్నాడని సమాచారంతో మర్రిగడ్డ ఎక్స్ రోడ్ వద్ద పట్టుకున్నట్లు, ఆటో, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, జనవరి 11 : కరీంనగర్‌లోని లక్ష్మినగర్‌లో పేకాట ఆడుతున్న ఒక స్థావరంపై గురువారం కరీంనగర్ స్పెషల్‌బ్రాంచి సీఐ కే సృజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి తొమ్మిది మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి వద్దనుంచి 1.40 లక్షల రూపాయలు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ధర్మారం,జనవరి11: మండలంలోని బొమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బొల్లి లచ్చయ్య(60) అనే వృద్ధుడు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. గత నెల 30న రాత్రి ఇంటి ముందు చలిమంట కాగుతుండగా మంటలంటుకున్నాయి. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతుని కొడుకు బొల్లి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాటం ఉధృతం'

గణేశ్‌నగర్, జనవరి 11 : జనాభా దామాషా ప్రకారం బీసీల వాటా కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటాన్ని ఉధృతం చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ బీసీలకు గురువారం పిలుపునిచ్చారు. బీసీ మహనీయుల జన్మ స్థలాలను సందర్శించే కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లా కేంద్రానికి విచ్చేసిన తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి నివాళులర్పించారు. చట్ట సభల్లో బీసీ వాటా, బీసీ హక్కుల సాధన కోసం అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దుబ్బాక రమేష్, పెంట అజయ్ పటేల్, మునిగాంటి అశ్విన్, గిరిగాని భిక్షపతి, కార్యదర్శి తౌటం సత్యం, కాల్వ మధుబాబు, కాల్వ కిషన్, రాంపర్తి వికాస్, సాయికిరణ్, పాల్గొన్నారు.

పందెం కోడికి వేలం

భగత్‌నగర్, జనవరి 11: ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన పందెం కోడికి నేడు కరీంనగర్-2 డిపోలో వేలం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీన ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన కోడికి సంబంధించి ఎవరూ రాలేదన్నారు. కరీంనగర్ అంబేద్కర్ బస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆసక్తికల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కరీంనగర్ రూరల్, జనవరి 11: వ్యవసాయ కమిషనర్ ఆదేశాల మేరకు ఫెర్టిలైజర్ ఇన్వెంటోరీ వెరిఫికేషన్ సిస్టం ద్వారా కరీంనగర్ రూరల్ మండలంలోని గురువారం వ్యవసాయాధికారి బి సత్యం మూడు దుకాణాలను తనిఖీ చేశారు. తీగలగుట్టపల్లిలోని కేడీసీఎంఎస్, వల్లంపహాడ్‌లోని వాసవి ఫెర్టిలైజర్స్, నగునూరులోని అగ్రోస్ సెంటర్ దుకాణాలను తనిఖీ చేశారు. యూరియా, డీఏపీ, ఈపాస్ మిషన్‌తోపాటుగా నిల్వఉన్న ఎరువులు సరిపోయే వరకు ఆయా దుకాణాల పేర్లు ప్రతీ వారం తనిఖీ నిర్వహిస్తామని తెలిపారు.

చొప్పదండి: పట్టణంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి గురువారం తనిఖీ చేశారు. ఎరువుల నిల్వల వివరాలను నమోదు చేసుకున్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొత్తకొండ జాతరకు ప్రతీ రోజు 80 ఆర్టీసీ బస్సులు

భీమదేవరపల్లి, జనవరి 11 : కొత్తకొండ జాతర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కొత్తకొండ జాతరకు ప్రతిరోజు హుజూరాబాద్ నుంచి 80ట్రిప్పుల ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. గురువారం కొత్తకొండ జాతరలో ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్‌ను పరిశీలించారు. బ్రహ్మోత్సవాలకు హుజూరాబాద్ డిపో నుంచి 20 బస్సులను రోజు 80ట్రిప్పులు నడపనున్నట్లు తెలిపారు. పెద్దలకు రూ. 60, చిన్నారులకు రూ. 30 టికెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులను హుజూరాబాద్ నుంచి వయా మాణిక్యాపూర్, ముల్కనూర్, కొత్తకొండకు ప్రయాణీకులను చేరవేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళా ప్రయాణికులకు ఉచితంగా జాతరకు చేరవేస్తామన్నారు. అనంతరం కొత్తకొండ శ్రీవీరభద్రస్వామిని దర్శించుకున్నారు. కాగా కొత్తకొండ జాతరకు రావాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు దేవాలయ అర్చకులు, సిబ్బంది గురువారం ఆహ్వాన పత్రం అందజేశారు.

అక్షర సూర్యుడు 'అలిశెట్టి'

- **జగిత్యాల జైత్రయాత్రలో కలం ఎర్ర సూరీడై..**
- **సాహితీ మిత్రదీప్తితో కవిత్వంపై అభిలాష**
- **నేడు అలిశెట్టి జయంతి, వర్ధంతి**



అలిశెట్టి ప్రభాకర్

జగిత్యాల/సిరిసిల్ల/కరీంనగర్ కల్చరల్ జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పద సంపద పరిమితమైన అపరిమితమైన భావసంపద ఉన్న కవిత్వం అతని సొంతం..పొట్టి పొట్టి వ్యాక్యాల్లో పొడవైన వాదాన్ని పూరించి సూటిగా ప్రశ్నించడమే ఆ..కవితల గొప్పతనం. పొట్టి కవితల్లో తన వాదాన్ని గట్టిగా వినిపించిన కవి అలిశెట్టి ప్రభాకర్. నిర్భయంగా, నిజాయితీగా తన మదిలో మెదిలిన ఆలోచనలను కలంలో నింపి, అక్షరాలను ప్రకాశింప జేసిన కవనసూరీడు అతడు. అలిశెట్టి జన్మించింది, మరణించింది ఒకే తేదీన కావడం యాదృచ్ఛికమైనా మరణం నా చివరి చరణం కాదు అని ప్రకటించిన అక్షర వీరుడిగా సాహితీ అభిమానుల్లో చెదిరిపోని ముద్రను వేసుకున్నాడు. నేడు అలిశెట్టి జయంతి, వర్ధంతి సందర్భంగా అందిస్తోన్న ప్రత్యేక కథనం..

● అడుగడుగున అలిశెట్టికి కష్టాలే...

జగిత్యాలలో 1956 జనవరి 12న జగిత్యాలలోని అంగడిబజార్ ప్రాంతంలో జన్మించిన అలిశెట్టి ప్రభాకర్‌కు ఏడుగురు అక్కాచెల్లెల్లు, ఇద్దరు అన్న దమ్ములు కాగా ప్రభాకర్ ఐదోవాడు. అలిశెట్టికి భార్య భాగ్యలక్ష్మితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. బతుకు దెరువు కోసం తన అభిరుచులైన చిత్రలేఖనం, ఫొటోగ్రఫీని వినియోగించుకున్నాడు. సిరిసిల్లలో ఫొటోగ్రఫీ నేర్చుకుని, 1975లో జగిత్యాలలో పూర్ణిమ స్టూడియోను ప్రారంభించాడు. 1979లో కరీంనగర్‌లో స్టూడియో శిల్పి నడిపాడు. 1982లో హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. 1983లో స్టూడియో చిత్రలేఖ స్థాపించాడు. హైదరాబాద్ నగర జీవితాన్ని 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో సిటీ లైఫ్ సీరియల్‌గా రాశాడు.

● జగిత్యాల జైత్రయాత్రలో సాహితీ భాగస్వామ్యం..

సాహితీ మిత్ర దీప్తి సంస్థ పరిచయంతో కవిత్వంపై అలిశెట్టికి అభిలాష ఏర్పడింది. 1978లో జగిత్యాల జైత్రయాత్రతో తన కలం ఎర్ర సూరీడై ప్రజ్వలించింది. దోపిడి దారుల అకృత్యాలు, పెత్తందారుల అణిచివేత లతో సతమతమవుతున్న ప్రజల హృదయ ఘోషను తన కవితా వస్తువుగా మలుచుకున్నాడు. రగిలిన గుండె ఎర్రపావురమై ఎగిరి జైత్ర యాత్ర లో సాహితీ భాగస్వామ్యాన్ని అందించాడు. ఆ తదుపరి మంటల జెం డాలు, చురకలు, రక్తరేఖ, ఎండమావి, సంక్షోభ గీతం, సిటీలైఫ్ సంపుటా లు ముద్రితమయ్యాయి. అనారోగ్యం బారిన పడి 1993 జనవరి 12న అస్తమించాడు. అతడు అస్తమించినా అలిశెట్టి మినీ కవిత్వం ప్రతీ నోట వినబడుతోంది

● మారసం ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

సాహితీవేత్త అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతిని సిరిసిల్ల మానేరు రచయితల సంఘం ఘనంగా నిర్వహిస్తోంది. గురువారం సిరిసిల్లలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అలిశెట్టి కవిత్వంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని శారద మాట్లాడుతూ అలిశెట్టి ప్రభాకర్ మినీ కవితల ద్వారా సమాజ హితాన్ని కోరుకున్నారన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశం కూడా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మానేరు రచయితల సంఘం అధ్యక్షుడు టీవీ నారాయణ, కార్యానిర్వాహక అధ్యక్షుడు ఎలగొండ రవి, ప్రధాన కార్యదర్శి ఆడెపు లక్ష్మణ్, రచయిత బూర దేవానందం, ఉపాధ్యాయులు జయంతి, సతీష్‌బాబు, రమేష్, కరికె నరేందర్ పాల్గొన్నారు.



బాల్య మిత్రులతో అలిశెట్టి

నృసింహుడి ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

ధర్మపురి, జనవరి 11: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం హుండీ లెక్కింపు గురువారం నిర్వహించగా రూ 54,21,314 ఆదాయం లభించింది. 95 రోజులకు సంబంధించిన హుండీలు తెరచి లెక్కింపు నిర్వహించగా ఈ ఆదాయం లభించింది. అలాగే 90 గ్రాముల మిశ్రమ బంగారం, 6 కిలోల 200 గ్రాముల మిశ్రమ వెండి, 31 విదేశీ నోట్లు లభించాయి. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ ఎ. చంద్రశేఖర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ వైస్‌చైర్మన్, ఆలయ రినోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామయ్య, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివా సాచార్యులు, సీనియర్ అసిసెంట్ అలువాల శ్రీనివాస్, ఆర్యవైశ్య సత్రం కోశాధికారి జక్కు దేవేందర్ పాల్గొన్నారు.

● ఆలయానికి స్టీల్ హుండీలు బహూకరణ

ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పక్షాన రూ 2 లక్షలు విలువ గల రెండు హుండీలను ఆ బ్యాంక్ డీజీఎం శంకర్ హేంబ్రం చేతుల మీదుగా గురువారం సమర్పించారు. ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం రెండు స్టీల్ హుండీలను ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్‌కు అందించారు. ఆలయం పక్షాన ఆయనను స్వామి శేష వస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుబీఐ జగిత్యాల జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పొన్న వెంకటరెడ్డి, చీఫ్ మేనేజర్ సరల్‌గుప్తా, ధర్మపురి బ్రాంచ్ మేనేజర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్లు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 11: సిద్దిపేట జిల్లాలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో జరగనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్ల వివరాలను జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్ ప్రకటించారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభచాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని తెలిపారు.

● ఎంపికైన జట్లు..

బాలికల విభాగంలో బి ప్రవళిక(ధర్మారం), జి అంజలి (ధర్మారం), బి వైష్ణవి(కొడిమ్యాల), కె వెన్నెల(కుమ్మరిపల్లి), ఆర్ పూజిత(కుమ్మరిపల్లి), గౌరి పూజిత(కరీంనగర్), ఆర్ అఖిల(కుమ్మరిపల్లి), టి శిరీష(ధర్మారం), సిరిచందన, లిఖిత(మానకొండూర్), బి జలజ(కొడిమ్యాల), బి లేఖన, ఎన్ వైష్ణవి(కుమ్మరిపల్లి), ఎన్ చరణి(ధర్మారం), జి కావ్య (కుమ్మరిపల్లి), బి శ్రావ్య(కొడిమ్యాల) ఎంపికయ్యారు.

బాలుర విభాగంలో ఆర్ అనిల్, ఆర్ హర్షవర్ధన్(మానకొండూర్), ఎ వర్షిత్(మల్యాల), ఓ సాయి, డి సిద్ధార్థ(ధర్మారం), ఎ మనోజ్‌కుమార్, టి అరుణ్ కుమార్, బి రాహుల్, సీహెచ్ రిషి(కుమ్మరిపల్లి), ఎ రోహిత్, కె అభినవ్(కరీంనగర్), టి బాలాజీ(దేవంపల్లి), డి శ్రీనివాస్(ధర్మారం), జె నాగరాజు(నందిమేడారం), ఎండీ రియామొద్దీన్(కేశవపట్నం) ఎంపికయ్యారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక జనవరి 11: మండలంలోని మాల్లారెడ్డిపల్లి గ్రామంలోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్నా ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణ చేస్తున్నా డ్రైవర్ రాయనవేని హరీష్, యాజమని రాయవేని సంపత్ పై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

మల్లికార్జున స్వామి హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

గొల్లపల్లి, జనవరి 11: ప్రముఖ పుణ్యక్షేత్రం మల్లన్నపేట మల్లికార్జున స్వామి దేవాలయం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఈ సందర్భంగా హుండీ ఆదాయం రూ.22,37,246లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇందులో హుండీ ద్వారా రూ.18,10,786, టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.4,26,460, మిశ్రమ బంగారం 10 గ్రాముల 500 మి.గ్రా., మిశ్రమ వెండి 790 గ్రాములు సమకూరినట్లు చైర్మన్ కొండూరు శాంతయ్య, ఈవో విక్రమ్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రవి కిషన్, నాయకులు సిద్ధంకి మల్లయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గొల్లపల్లి, జనవరి 11: మండలంలోని శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన బుర్ర గడ్డ శివ కుమార్ (21) గురువారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన బుర్రగడ్డ లత-శంకరయ్య దంపతులకు ఒక్కగానొక్క కొడుకు శివ కుమార్ మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. శివ కుమార్ ఇటీవల గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. తన పెద్దనాన్న గంగన్నతో కలిసి తాటి చెట్టు ఎక్కడానికి శ్రీరాములపల్లె గ్రామంలో రోడ్డు పక్కన ద్విచక్ర వాహనాన్ని నిలుపుతున్నాడు. ఈ క్రమంలో గొల్లపల్లి వైపు నుంచి హన్మాజీపేటకు చెందిన ప్రేమ్ కుమార్ అనే యువకుడు ద్విచక్ర వాహనంతో అతి వేగంగా ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై ఉన్న శివ కుమార్‌తో పాటు గంగన్నలు రోడ్డు పక్కన ఎగిరిపడ్డాడు. ఈ ప్రమాదంలో శివ కుమార్ తలకు తీవ్ర గాయాలు కాగా, గంగన్నకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన కుటుంబసభ్యులు జగిత్యాల ప్రధాన ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యుల సూచనల మేరకు కరీంనగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో శివకుమార్ మృతి చెందాడు. దీంతో శ్రీరాములపల్లె గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేస్తే చర్యలు



విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

ఇల్లందకుంట, జనవరి 11: ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం ఇల్లందకుంట పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఆదివారం రాత్రి ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసిన నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. మండలంలోని సిరిసేడు, బోగంపాడు గ్రామాలకు ఇల్లందకుంట శివారులోని ఎర్రగట్టు గుట్టల సమీపంలో ఆ రెండు గ్రామాలకు ఎకరం భూమిని కేటాయించారని చెప్పారు. కానీ కొందరూ వ్యక్తులు ఆ ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసి ఆ భూమిని అక్రమించేందుకు కుట్ర పన్నినట్లు వెల్లడించారు. ఆ స్థలంలో 2,450 మొక్కలు నాటారని చెప్పారు. సుమారు వాటి ఖర్చు రూ. 6,44,436 అయినట్లు వివరించారు. కాగా సిరిసేడు గ్రామానికి చెందిన ఎంపీటీసీ చిన్నరాయుడు, రేణికుంట్ల రామస్వామి ఆ భూమిని అక్రమించుకోవాలని కుట్ర పన్నారని చెప్పారు. ఈ క్రమంలో సిరిసేడు గ్రామానికి చెందిన సల్పాల రమేశ్‌కు చెందిన ఎక్స్‌కావేటర్ సహాయంతో చెట్లను తొలగించారని చెప్పారు. సోమవారం ఉదయం ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసిన సంఘటనపై పంచాయతీ కార్యదర్శి అంకూస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని తెలిపారు. ఈ మేరకు చిన్నరాయుడు, రామస్వామి, సల్పాల రమేశ్, ఎక్స్‌కావేటర్ డ్రైవర్ శశికుమార్‌లను గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితుల నంచి మోటర్ సైకిల్, ఎక్స్‌కావేటర్ స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆస్తులను ధ్వంసం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సీఐ కిశోర్, ఎస్‌ఐ రాజకుమార్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు. ఇంత జరిగిన నిందితులను అరెస్టు ను విలేకరులకు చూపకపోవడం గమనార్హం. సమావేశంలో రూరల్ సీఐ కొరె కిశోర్, ఎస్‌ఐ రాజకుమార్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

తంగళ్లపల్లి, జనవరి 11: తంగళ్లపల్లి మండల కేంద్రంలో చెన్నూరి పోశయ్య (30) అనే వలస కూలీ కుటుంబ కలహాలతో బుధవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన చెన్నూరి పోశయ్య, చిట్టి దంపతులు మూడు సంవత్సరాల క్రితం తంగళ్లపల్లికి వలస వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో భార్యభర్తలకు గొడవ జరగడంతో భార్య చిట్టి తల్లిగారింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లోనే చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కమాన్‌పూర్, జనవరి 11 : మండలంలోని గుండారం గ్రామపరిధిలోని రాజేంద్రనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫైంటిక్లయిన్ కాలనీకి చెందిన అభిషేక్ తన ద్విచక్ర వాహనంపై పెద్దపల్లి నుంచి స్వగ్రామం వైపు వస్తుండగా, గుండారం గ్రామానికి చెందిన పోలుదాసరి శేఖర్ తన ద్విచక్ర వాహనంపై రాజేంద్రనగర్ వైపు వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. శేఖర్ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్దపల్లి ప్రభుత్వా సుపత్రికి తరలించారు. పోలీసులు వివరాలను సేకరించారు.

వివాహిత బలవన్మరణం

కోనరావుపేట, జనవరి 11: కోనరావుపేట మండలం బావుసాయిపేటలో వరకట్నం వేధింపులతో ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య పాల్పడగా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతురాలి భర్త, అత్తమామపై గొడవకు దిగారు. సంఘటన స్థలానికి చేరుకున్న వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి గొడవ జరగకుండా బందోబస్తు నిర్వహించారు. పోలీసుల కథనం ప్రకారం... కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన సయ్యద్ అస్లీమ్‌తో వేములవాడ మండలం ఫాజుల్‌నగర్ గ్రామానికి చెందిన నజీనా (21)కు రెండు సంవత్సరాల క్రితం పెళ్లి చేశారు. వివాహ సమయంలో ఐదు తులాల బంగారం, లక్ష రూపాయల నగదు, రెండు లక్షల బండి ఇచ్చి వివాహం చేశారు. వివాహం చేసిన అనంతరం ఆరు నెలలు బాగానే ఉన్నారు. అప్పటి నుంచి మరో రెండు లక్షల రూపాయలు కట్నం తేవాలని భర్త అస్లం, మామ హైదర్, అత్త గోరబి వేధించారు. మరోవైపు మూడు నెలల పాప కళ్లు కనిపించకుండా పుట్టడం నజీనాను కుంగ తీసింది. పాపకు హైదరాబాద్‌లో చికిత్స చేయించడానికి మూడు లక్షల రూపాయలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. భర్త పట్టించుకోకపోవడంతో వీరి మధ్య దూరం పెరిగింది. ఈ క్రమంలోనే మనోవేదనకు గురైన నజీనా గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆత్మహత్య గల కారణాలను పరిశీలించారు. గొడవలు జరగకుండా వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారి, చందుర్తి సీఐ కిరణ్ కుమార్, కోనరావుపేట ఎస్సై ఆంజనేయు బందోబస్తు నిర్వహించారు. మృతురాలి తండ్రి మహమ్మద్ ఇచ్చిన ఫిర్యాదుతో భర్త అస్లం, మామ హైదర్, అత్త గురబీపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్‌బీఐ ఏటీఎం చోరీకి యత్నం

సిరిసిల్ల క్రైం, జనవరి 11: సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లో ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి దొంగలు ప్రయత్నించారు. గురువారం తెల్లవారు జామున బీవైనగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలో దొంగలు చొరబడి బద్దలుకొట్టి దొంగిలించేందుకు యత్నించారు. ఈ చోరీ యత్నంపై ఏటీఎం సూపర్‌వైజర్ ఎస్.మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీ

కోల్‌సిటీ, జనవరి 11: గోదావరిఖని మార్కండేయ కాలనీ, వెంకటేశ్వరకాలనీలో బుధవారం రాత్రి తాళం వేసి ఉన్న నాలుగు ఇళ్లల్లో చోరీలు జరిగాయి. మార్కండేయ కాలనీలోని ఎండీ అఫ్జాద్‌పాషా ఇంటికి తాళం వేసి వెనుక గదిలో నిద్రిస్తుండగా ఇంటి తాళం పగులగొట్టి లోనికి చొరబడ్డ దొంగలు ఇంట్లోని తులంన్నర బంగారం, రూ.40వేల నగదు ఎత్తుకెళ్లినట్టు పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముల్కనూర్ డెయిరీ సందర్శన

భీమదేవరపల్లి, జనవరి 11: ముల్కనూర్ మహిళా డెయిరీలో అమలు చేస్తున్న డీబీఎఫ్ ప్రాజెక్టును నాబార్డ్ అధికారులు గురువారం సందర్శించారు. నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీనాథ్, అసిస్టెంట్ మేనేజర్ మహదేవ్ రెడ్డి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో డ్రైవింగ్‌లో శిక్షణ

- టైడ్స్ ప్రిన్సిపాల్ రాఘవన్

సిరిసిల్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన డ్రైవింగ్ శిక్షణ అందిస్తున్న టైడ్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని అంతర్జాతీయ డ్రైవింగ్ శిక్షణ పరిశోధన సంస్థ ప్రిన్సిపాల్ బూవ రాఘవన్, జిల్లా రవాణాశాఖ అధికారి కొండల్‌రావు తెలిపారు. గురువారం అంతర్జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం సందర్భంగా తెలంగాణలో అతి పెద్ద తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (టైడ్స్)లో అంతర్జాతీయ ప్రమాణాల ద్వారా చేపడుతున్న కార్యకలాపాలు, రహదారి భద్రతపై సదస్సు నిర్వహించారు. జిల్లాలోని పాత్రికేయ బృందం ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రాఘవన్, కొండల్‌రావు మాట్లాడుతూ డ్రైవింగ్ శిక్షణ సంస్థలో మెకానికల్ నాలెడ్జ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. దేశంలో ఏటా 4.50 లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ ప్రమాదాల్లో 1.50 లక్షల మంది మరణిస్తున్నారని అన్నారు. ఇందులో యువతనే ఎక్కువగా ఉంటున్నారన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన లేకపోవడం సరైన శిక్షణ లేకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రైవర్లకు శిక్షణ ఇచ్చేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మండెపల్లిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అశోక్ లేలాండ్ సంయుక్త ఆధ్వర్యంలో రూ.22 కోట్లతో శిక్షణ సంస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఐదెకరాల్లో పరిపాలన, వసతి గృహ భవనాలు, 15 ఎకరాల్లో డ్రైవింగ్ ట్రాక్‌లు నిర్మించినట్లు వివరించారు. శిక్షణ కాలపరిమితిలో 21 రోజుల కోర్సుకు రూ.7,080, 30 రోజుల కోర్సుకు రూ.16,520, మూడు రోజుల కోర్సుకు రూ.2250, ఒక రోజు కోర్సుకు రూ .750 చొప్పున ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు వివిధ కోర్సుల్లో 4 వేల మంది అభ్యర్థులు శిక్షణ పొందారని, 350 మందికి ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అందిస్తున్న శిక్షణను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో దశరథం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టైడ్స్ ప్రిన్సిపాల్ రాఘవన్


పెద్దపల్లి గాయత్రి విద్యానికేతన్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు


పెద్దపల్లి ట్రినిటి పాఠశాలలో..


గోదావరిఖని కృష్ణవేణి స్కూల్‌లో..

విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

పెద్దపల్లి కల్చరల్, జనవరి 11 : సంక్రాంతి పండుగ నేపథ్యంలో ముందస్తుగా విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబరాలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ట్రినిటి బీఈడీ, డీఈడీ శిక్షణ కళాశాలలో ఘనంగా జరిగాయి. మున్సిపల్ చైర్ పర్సన్ మమతారెడ్డి, ప్రిన్సిపాల్స్ రెడ్డమ్మ, బుర్ర తిరుపతి, రజని, దిలీప్‌శర్మ, అధ్యాపకులు మధుకర్, గోపీనాథ్, తిరుపతి పాల్గొన్నారు. గాయత్రి విద్యానికేతన్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్, రజని శ్రీనివాస్ బహుమతులు ప్రదానం చేశారు.

కోల్‌సిటీటౌన్ : గోదావరిఖని పలు విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి విద్యాసంస్థలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిగాయి. పాఠశాల డైరెక్టర్ మంజులా శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు. రమేష్ నగర్‌లోని ఉషోదయ హైస్కూల్ ఆవరణలో ముగ్గుల పోటీలు ఘనంగా జరిగాయి. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల తోపాటు కన్సోలేషన్ బహుమతులు అందించారు. పాఠశాల కరస్పాండెంట్ కొత్త శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఎం.శ్రీలక్ష్మి, జె.భాగ్యలక్ష్మి, సిహెచ్ ఉష, కె. తిరుమల, బి.అరుణ తదితరులు పాల్గొన్నారు. విఠల్‌నగర్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిగాయి. ప్రధానోపాధ్యాయులు బొంతల సతీష్, ఉపాధ్యాయులు ప్రవీణ్, సరళ, అరుణ, అనురాధ, సుభాష్, మనోహర్, నవేష్, సంగీత పాల్గొన్నారు. రాజలక్ష్మికాలనీలో మహిళా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి. గెలుపొందిన మహిళలకు మాజీ కౌన్సిలర్ గాజుల రాజమల్లు బహుమతులు అందజేశారు. రాజరాజేశ్వర సోఫా ఫ్యాక్టరీ సహకారంతో జరిగిన పోటీల్లో కాలనీవాసులు ఉరగోండ రమేష్, కె.పి.రాజ్‌కుమార్, దబ్బెట శంకర్, రమేష్, రవి, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

జ్యోతినగర్ :ఎన్టీపీసీలోని విశ్వభారతి విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. విశ్వభారతి, నవోదయ, సెయింట్ జోసఫ్ పాఠశాలల్లో ముగ్గుల పోటీలు, బొమ్మల కొలువు, వేషధారణ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్, నవోదయ, సెయింట్ జోసఫ్ పాఠశాలల హెచ్‌ఎంలు తిరుపతిగౌడ్, నోయల్ జోసఫ్, ఆశాలత, ప్రవీణ్‌కుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : మండలంలోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్ ముగ్గులు, గాలిపటాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అకౌంట్స్ ఆఫీసర్ పవన్‌కుమార్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : స్థానిక వివేకానంద స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలకిషన్ ప్రసాద్, డైరక్టర్ రవీందర్, కరస్పాండెంట్ సుజాత, ప్రిన్సిపాల్ మదుసూదన్‌రెడ్డి, చందు తదితరలు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలోని పెగడపల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సబ్బని ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

మంథని : పట్టణంలోని కాకతీయ ఉన్నత పాఠశాల, కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు. ముగ్గుల పోటీలను నిర్వహించారు. గెలుపుపొందిన వారికి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎంలు ప్రదీప్‌రెడ్డి, జాఫర్, డైరెక్టర్లు రవి కిరణ్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, స్రవంతి, సుదర్శన్‌రెడ్డి, పావనిలు పాల్గొన్నారు.

పాలకుర్తి : మండలం పరిధిలోని ఘన్‌శ్యామ్ ధాస్‌నగర్ గ్రామ పంచాయతీలోని యూనివర్సల్ పాఠశాలతోపాటు బసంత్‌నగర్ ఆలీవర్ పాఠశాల, పుట్నూర్‌లోని గ్లోబల్ పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. కరస్పాండెట్లు మహ్మద్ ఇస్మాయిల్, జాఫర్ బేగ్, బుర్ర సత్యంగౌడ్, సతీష్‌లు సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రామగిరి : మండలంలోని బేగంపేట్ సాయిప్రగతి పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. పాఠశాల ఆవరణలో రంగులతో ముగ్గులు వేశారు. సంక్రాంతి పండుగ విశిష్టతలో భాగంగా బోగి మంటలు వేసి వాటి చూట్టూ పిల్లలు ఆడి పాడారు. కరస్పాండెంట్ తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రశాంతి, డైరెక్టర్స్ శ్రీనివాస్, శ్రీధర్‌బాబు, అనిల్ కుమార్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మంథనిలోని కాకతీయలో పాఠశాలలో..


బేగంపేట్ సాయిప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో..


గోదావరిఖని ఉషోదయ హైస్కూల్‌లో ముగ్గుల పోటీలు


ఎన్టీపీసీలోని విశ్వభారతిలో ముగ్గుల పోటీ..


పెద్దపల్లి మదర్ థెరిస్సా కళాశాలలో..

ఆరు గ్యారెంటీ హామీలపై అవగాహన..

కమాన్‌పూర్, జనవరి 11: మండలంలోని రొంపికుంటలో తెలంగాణ సాంస్కృతిక కళాకారుల ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, డ్రగ్స్ వలన కలిగే అనార్థల గురించి, ఆరు గ్యారెంటీ హామీల గురించి గురువారం అవగాహన కల్పించారు. కళాకారులు

రుణం చెక్కు అందజేత

కమాన్‌పూర్, జనవరి 11 : మండలంలోని జూలపల్లిలోని సౌమ్య గ్రూప్ మహిళ సంఘాల ద్వారా రూ.20లక్షల చెక్కు మంజూరు కాగా గురువారం ఎస్‌బీఐ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్ చేతుల మీదుగా సర్పంచ్ బొల్లపల్లి శంకర్‌గౌడ్ చెక్కును అందజేశారు. ఏపీఎం శాంతి శైలజ, సీసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి రవాణాను అడ్డుకున్న గ్రామస్థులు

పెద్దపల్లి రూరల్, జనవరి 11 : మండలంలోని బొంపల్లి నుంచి అక్రమంగా మట్టి తరలిస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులున్నారు.


అనాథ పిల్లలకు దుప్పట్లు పంపిణీ

మార్కండేయకాలనీ, జనవరి 11: కాంగ్రెస్ నాయకురాలు మనాలీ ఠాకూర్ జన్మదినం సందర్భంగా గోదావరిఖనిలో పలు అనాథ ఆశ్రమాల్లో పిల్లలకు దుప్పట్లు అన్నదానం నిర్వహించారు. గోదావరిఖని చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మనాలీ ఠాకూర్ తన జన్మదిన కేక్‌కట్ చేసి ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు. విఠల్‌నగర్‌లోని అమ్మపరివార్ ఆశ్రమంలోని పిల్లలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనుమ సత్యనారాయణ, చెరుకు శంకర్, ఆడెపు రవి, అంజి, ఓదెల రాజు, చొప్పరి మొగిలి, సిరిపురం రాజేష్, మహేష్ పాల్గొన్నారు. గాంధీనగర్‌లోని ఎండీహెచ్‌డబ్ల్యూఎస్ అనాథ పిల్లల ఆశ్రమంలో కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ దూళికట్ట సతీష్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం పిల్లలకు అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మిట్టపల్లి మహేందర్, కాంట్రాక్టర్ విశ్వతేజ, కళ్యాణి శ్రీనివాస్, రాజయ్య పాల్గొన్నారు. వీర్లపల్లిలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమంలో మాజీ కార్పొరేటర్ కందుల స్వరూపసతీష్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్కలపల్లి సర్పంచ్ చిట్టబోయిన రాజ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు మండ రమేష్, దబ్బెట మల్లేష్, ఎరుకల అంజి, బండి సాయి, సునీల్, సాయితేజ, స్వామి పాల్గొన్నారు.

అంతర్గాం : రామగుండం తబితా అనాథ ఆశ్రమంలో గురువారం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలీ ఠాకూర్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్‌కే ఇఫ్తాకర్ అహ్మద్, ఈదునూరి హరిప్రసాద్, అప్పాసి శ్రీనివాస్, గజ్జెల నాగరాజు, సింగం కిరణ్ కుమార్‌గౌడ్, సాదు రమేష్, ఎండీ జబ్బార్, సిరిశెట్టి, సతీష్‌గౌడ్, కాసర్ల మల్లేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వస్తువుల పంపిణీ

మంథనిరూరల్, జనవరి 11: మండలంలోని ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు శాస్త్రులపల్లికి చెందిన రిటైర్డు హెచ్‌ఎం నల్ల చంద్రయ్య పలు వస్తువులను గురువారం అందించగా సర్పంచ్ చెన్నవేన సదానందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులకు వాటర్ ఫ్రిజ్, బెల్టులు, బ్యాడ్జీ, టైలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి నల్మాస హరిప్రసాద్, కాంప్లెక్స్ హెచ్‌ఎం డాక్టర్ సురేష్‌కుమార్, పీఎస్ హెచ్‌ఎం జ్యోతి, ఎంపీటీసీ పెంద్రి చైతన్య-ప్రభాకర్‌రెడ్డి, టీచర్లు వొడ్నాల సహేందర్, చంద్రశేఖర్, మమతలు పాల్గొన్నారు.



ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ నాయకులను నిలదీయండి

- మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ ఏరియా కమిటీ కార్యదర్శి ప్రభాత్

గోదావరిఖని, జనవరి 11: ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీల్లోని అవినీతి నాయకులను నిలదీయాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ ఏరియాకార్యదర్శి ప్రభాత్ పిలుపునిచ్చారు. గురువారం మీడియాకు పంపిన ఒక ప్రకటనలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ సంఘాలకు సంబంధించిన నాయకులపై ప్రభాత్ తీవ్రమైన ఆరోపణలు చేశారు. కేసీఆర్ గారాల పుత్రిక సంఘం, కార్మికుల విద్రోహుల ముఠా సంఘం, చరిత్రహీనుల టీబీజీకేఎస్‌ను సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఓడించిన సింగరేణి కార్మికులకు విప్లవ జేజేలు అని తెలిపారు. టీబీజీకేఎస్ కార్మిక ద్రోహులే ఊసర వెల్లుల్లా తిరిగి ఏఐటీయూసీలోకి కొందరు, ఐఎన్‌టీయూసీలోకి కొందరు చేరిపోయారని ఆయన అన్నారు. ఇందు కోసం ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు లక్షల రూపాయలు ముడుపులు తీసుకున్నారని ఆరోపించారు. శ్రీరాంపూర్ ఏరియాలో ఒక అగ్రవర్ణానికి చెందిన కార్మిక ద్రోహి ఐఎన్‌టీయూసీ నాయకుడు జనక్ ప్రసాద్‌కు రూ.30లక్షల ముడుపులు ఇచ్చాడని, అదే రీతిలో కొన్ని ఏరియాల్లో కూడా జనక్‌ప్రసాద్ తన యూనియన్‌లో చేర్చుకోవడానికి, పదవులు ఇవ్వడానికి బేరాలకు పాల్పడ్డట్టు తెలిసిందని ఆరోపించారు. ఏఐటీయూసీ నాయకుడు సీతారామయ్య టీబీజీకేఎస్‌లోని నాయకులకు లక్షలాది రూపాయలు ఇవ్వడంతో పాటు ఏఐటీయూసీ గెలిస్తే టీబీజీకేఎస్‌కు గనులస్థాయి నుంచి ఏరియా స్థాయి వరకు కమిటీల్లో సర్దుబాటు చేస్తానని ఒప్పందం కుదుర్చుకోవడం తమ దృష్టికి వచ్చిందన్నారు. స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యేల పరోక్ష మద్దతు, ఆర్థిక అండలను పొందిన ఏఐటీయూసీ ఆర్‌జీ-1,2నుంచి శ్రీరాంపూర్, మందమర్రి, గోలేటి వరకు ఓట్లు దండుకున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, మంత్రుల ప్రమేయంతోనే ఐఎన్‌టీయూసీ ప్రాతినిధ్య సంఘంగా గెలిచిందని, సీతారామయ్య, జనక్‌ప్రసాద్ ఇద్దరూ తోడు దొంగలేనని ఆరోపించారు. సింగరేణి కార్మికులను తగ్గిస్తూ కాంట్రాక్టు కార్మికులను పెంచుతూ వేతన దోపిడీకి గురిచేస్తున్నారని, చట్టబద్ధమైన వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. సింగరేణి యాజమాన్యం దోపిడీ, విధ్వంసానికి పాల్పడుతున్నదని, కొత్త కొలువులు, కొత్త గనులు లేకుండా ఉత్పత్తి లక్ష్యాలను పెంచుతున్నదన్నారు. సింగరేణి పరిరక్షణ, హక్కులను కాపాడుకునేందుకు సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) వెలుగులో కార్మికవర్గం సమరశీల పోరాటాలకు సిద్ధం కావా లని ఆయన పిలుపునిచ్చారు.

'సూపర్‌వైజర్ మృతిపై న్యాయ విచారణ జరిపించాలి'

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 11: సూపర్‌వైజర్ రమేష్ మృతిపై న్యాయ విచారణ జరిపించాలని సింగరేణి మైనింగ్ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ కన్వీనర్ రామ్మూర్తి డిమాండ్ చేశారు. గురువారం ఓసీపీ-3లో సూపర్‌వైజర్ మచ్చ రమేష్ సంతాప సభలో ఆయన మాట్లాడారు. కాలు ఎముక విరిగి సింగరేణి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు మృతిచెందడం వైద్యుల నిర్లక్షంగా భావించాల్సి ఉంటుందన్నారు. సింగరేణి ఆసుపత్రుల్లో స్పెషలిస్టు వైద్యులు లేక కార్మికులకు సరైన వైద్యం అందడంలేదని, కొన్ని సందర్భాల్లో అనారోగ్యం ముదిరిపోవడం, ప్రాణాలు పోవడం జరుగుతున్నదని రామ్మూర్తి అన్నారు. స్పెషలిస్టు వైద్యులను నియమించి, అవసరమైన వైద్యపరికరాలను సమకూర్చాలని డిమాండ్ చేశారు. సింగరేణి ఉద్యోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందిచేలా యాజమాన్యం దృష్టి సారించాలని రామ్మూర్తి డిమాండ్ చేశారు. ఈసందర్భంగా రమేష్ చిత్రపటానికి అధికారులు, కార్మికులు నివాళులు అర్పించారు. ఈ సంతాప సభలో దావు రమేష్, భీముని సత్యనారాయణ, శ్రీనివాస్, కృష్ణ, మోహన్‌రావు, బాపు, సదన్న, సురేష్, రాజన్న, సమ్మయ్య పాల్గొన్నారు.

ప్రభావిత గ్రామాల పర్యావరణ పరిరక్షకు కృషి..

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 11: ఆర్జీ-2 ఏరియా ప్రభావిత గ్రామాల పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని జీఎం సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం పండ్ల మొక్కల వాహనాన్ని జండా ఊపి ప్రభావిత గ్రామాలకు పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని జీఎం కార్యాలయంలో ప్రారంభించారు. ఈసందర్భంగా సూర్యనారాయణ మాట్లాడారు. వీకేపీ గని రేమేడి యేషన్ మేపర్స్ కింద ఏరియా పరిధిలో గల ప్రభావిత గ్రామాలు పెంచికల్‌పేట్, సింగిరెడ్డిపల్లె, చందనాపూర్, న్యూమారేడుపాక, అల్లూరు గ్రామాలకు మొదటి విడతలో 10వేల పండ్ల మొక్కలు పంపిణీ చేయడం జరుగుతుందని, రెండవ విడతలో మరో 10వేల మొక్కలను అందజేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, అధికారులు ధనుంజయ, మురళీకృష్ణ, సురేష్‌బాబు, అభిలాష్‌లు పాల్గొన్నారు.


పండ్ల మొక్కల వాహనాన్ని ప్రారంభిస్తున్న ఆర్జీ-2 జీఎం

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 11: సింగరేణి నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం జీఎం సూర్యనారాయణ ఆవిష్కరించారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధికారులు, కార్మిక సంఘాల నాయకుల సమక్షంలో క్యాలెండర్‌ని ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, అధికారులు మురళీకృష్ణ, భూక్యా దేశాయి, సునీత, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత..

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 11: సింగరేణి ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌లో భాగంగా రాహుల్ అనే విద్యార్థికి గురువారం జీఎం కార్యాలయంలో జరిగిన కార్యాలయంలో రూ.6.70లక్షల చెక్కును జీఎం సూర్యనారాయణ అందజేశారు. ఐఐఎం ఇండోర్‌లో ఎంబీఏ సీటు సాధించిన ముదాం రాహుల్‌కు ఉన్నత చదువుల కోసం యాజమాన్యం రూ.10 లక్షలు మంజూరు చేయగా, మొదటి విడతగా 6.70 లక్షల అందజేసినట్టు జీఎం పేర్కొన్నారు. రాహుల్‌తో పాటు తండ్రి సత్యనారాయణలను అభినందించారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, ఐఈ డీజీఎం మురళీకృష్ణ పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధి, కార్మిక శ్రేయస్సుకి కృషి చేయండి

- సీఎండీకి బీజేపీ నాయకురాలి విజ్ఞప్తి

గోదావరిఖని, జనవరి 11: సింగరేణి అభివృద్ధి, కార్మిక శ్రేయస్సుకు కృషిచేయాలని బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి సంస్థ సీఎండీ బలరాంనాయక్‌ను కోరారు. గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీ బలరాంనాయక్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా సంధ్యారాణి సీఎండీతో మాట్లాడారు. సంస్థ అభివృద్ధి, కార్మికుల శ్రేయస్సుకు కృషి చేయాలని కోరారు.

'కార్మికుల్లో సీఐటీయూకి ఆదరణ పెరిగింది'

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 11: సింగరేణి కార్మికుల్లో సీఐటీయూ పట్ల ఆదరణ పెరిగిందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆర్జీ-2 యూనియన్ కార్యాలయంలో జరిగిన డివిజన్ కమిటీ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావుతో కలిసి ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో 3,710 ఓట్లు రావడం సీఐటీయూకు పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమని అన్నారు. రెండు దఫాలు గెలిచిన టీబీజీకేఎస్ హయాంలో కార్మికులు బానిసత్వంలోకి నెట్టివేయబడ్డారని, కార్మిక సంఘాల నాయకులపై వేధింపులు జరిగినట్టు రాజారెడ్డి తెలిపారు. టీబీజీకేఎస్ సింగరేణిని ఆర్థికంగా దెబ్బతీసిందని, దీంతో ఎన్నికల్లో కార్మికులు తిరస్కరించినట్టు పేర్కొన్నారు. నాలుగవసారి గుర్తింపు సంఘం హోదా దక్కించుకున్న ఏఐటీయూసీ గతంలో చేసిన తప్పిదాలను చేయకుండా కార్మికులకు న్యాయం చేయాలని రాజారెడ్డి సూచించారు. జేబీసీసీఐ ఒప్పందాల అమలు, సొంత ఇంటి పథకాన్ని అమలు, కొత్త గనుల ప్రారంభం వంటి వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బ్రాంచి ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బ్రాంచి సెక్రెటరీ సంతోష్, నాయకులు ఉల్లి మొగిలి, ఎస్ వెంకన్న, సురేష్, ఎస్ వెంకటేశ్వర్లు, కిషోర్, సంపత్, వినయ్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలి : ఆర్జీ-3 జీఎం


సమావేశంలో మాట్లాడుతున్న జీఎం

రామగిరి, జనవరి 11: సంస్థ ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు తెలిపారు. గురువారం జీఎం కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పేర్కొన్నారు. భద్రత కూడిన ఉత్పత్తితోపాటుగా రవాణాను పెంచాలని సూచించారు. ఆర్థిక సంవత్సరం లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ఉత్పత్తి సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు ఎలీషా, రఘుపతి, రాజేందర్, వెంకటరమణ, జైనులాబద్దీన్, చంద్రశేఖర్, కాశీ విశ్వేశ్వర్‌రావు, పద్మరాజు, రవీందర్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ మేళా


సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ దీనాకుమారి

ధర్మారం, జనవరి 11: మండల కేంద్రంలోగల ఆదర్శ పాఠశాలలో గురువారం పాఠశాల స్థాయి(టీఎంఎల్) సైన్స్ ఎగ్జిబిషన్ మేళా నిర్వహించారు. పాఠశాల స్థాయిలో 150మంది వరకు పాల్గొన్నారు. ఎగ్జిబిషన్ మేళాను ప్రిన్సిపాల్ దీనాకుమారి, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పరిశీలించారు. ప్రతీ ఒక్క విద్యార్థి తయారు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ అవశ్యతను వివరించారు. అదేవిధంగా పాఠశాలలో ముందస్తుగా సంక్రాతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దీనాకుమారితో పాటు ఉపాద్యాయులు పాల్గొన్నారు.

అన్నదాన నిర్వాహకులకు సన్మానం

సుల్తానాబాద్, జనవరి 11: సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రినగర్‌లోగల అభయాంజనేయస్వామి ఆలయ అవరణలో పద్నాలుగా ఏళ్లగా అయ్యప్ప స్వాములకు అన్నదానం నిర్వహిస్తున్న గురుస్వాములు మిట్టపల్లి మురళీ, సాయిరి మహేందర్ పద్మ దంపతులను గురువారం ఘనంగా సన్మానించారు. ఏటా నలభై ఒక్క రోజులపాటు కార్యక్రమం నిర్వహిస్తారు. గురువారంతో కార్యక్రమం ముగింపు సందర్భంగా సన్మానించారు.

నేడు గోదారంగనాయకుల కల్యాణం

సుల్తానాబాద్, జనవరి 11: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం గోదారంగనాయకుల స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పల్లా మురళీ ఒక ప్రటనలో తెలిపారు. ఉదయం పదిన్నర గంటలకు కల్యాణం నిర్వహిస్తామని, భక్తులు పాల్గొనాలని కోరారు.

నేడు కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

ఓదెల, జనవరి 11: మండల కేంద్రంలోని మారుతి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చెక్కులను పంపిణీ చేస్తారని, తహసీల్దార్ యాకయ్య ఒక ప్రటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ. 41లక్షల650 విలువైన చెక్కులను అందజేస్తారని, లబ్ధిదారులు కార్యక్రమానికి వచ్చే సమయంలో ఆధార్ కార్డుతో పాటు మూడు రెవెన్యూ స్టాంపులు వెంట తీసుకురావాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

కోల్‌సిటీటౌన్, జనవరి 11: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల రాష్ట్రస్థాయి ఇగ్నైట్ పోటీల్లో రామగుండం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. పాటల పోటీల్లో సీనియర్ విభాగంలో అక్షయ గ్రూపు, జూనియర్ విభాగంలో నక్షత్ర గ్రూపు ప్రథమ స్థానం సాధించారు. హిందీ డిబేట్‌లో ఆస్మిత ద్వితీయ స్థానం, రాష్ట్రస్థాయి యూత్ పార్లమెంట్‌లో కరీంనగర్ రీజియన్ తరుపున పాఠశాల నుంచి స్పీకర్‌గా శైలజకు బహుమతులు అందుకున్నారు. కాగా పాఠశాలకు చెందిన విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపర్చడంపై గురువారం పాఠశాల ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ ఉమెన్స్ అధ్యక్షురాలు బాలసాని పద్మ, ఏలేశ్వరం శ్రీలత, కంకణాల శ్రీదేవి, లయన్స్‌క్లబ్ చైర్మన్ ఏలేశ్వరం చంద్రమౌళి, ప్రధానకార్యదర్శి బాలసాని స్వామి విద్యార్థులకు శాలువాలు కప్పి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మంజుల, ఉపాధ్యాయులు శ్రీనిజ, సలేహ, శ్యామల, స్వప్న, అభిమాన సంఘాల నాయకులు గుండేటి రాజేష్, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఆరు విద్యుత్‌పోల్స్ ధ్వంసం

పెద్దపల్లి రూరల్, జనవరి 11: మండలంలోని రంగాపూర్ గ్రామ శివారులో ప్రమాదవశాత్తు లారీ ఢీకొని ఆరు విద్యుత్ పోల్స్ విరిగిపోగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. దీనిపై విద్యుత్‌శాఖ ఏఈ కోటేశ్వర్ రావును వివరణ కోరగా గురువారం ఉదయం ఓ ఇటుక బట్టీకి చెందిన టిప్పర్ అన్‌లోడ్ చేసుకుని జాకీతో అలాగే వెళ్లడంతో విద్యుత్ వైర్లు తెగిపోవడంతో పాటు ఆరు స్తంభాలు విరిగినట్లు తెలిపారు. విరిగిన విద్యుత్‌పోల్స్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నట్లు ప్రజలకు విద్యుత్ అంతరాయం లేకుండా మరమ్మతులు చేపట్టినట్లు పేర్కొన్నారు.

రోడ్డుపై గుంత.. పొంచి ఉన్న ప్రమాదం

పెద్దపల్లి రూరల్, జనవరి 11: మండలంలోని పెద్దబొంకూరు, కొత్తపల్లి గ్రామానికి వెళ్లే మూలమలుపు వద్ద గుంత ఏర్పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. రాత్రి వేళల్లో అయితే గుంత ఏర్పడక పోవడంతో పలువురు గుంతలోపడి గాయాల పాలయ్యారని, అధికారులు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

పోలీస్‌ల ఆధ్వర్యంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

సుల్తానాబాద్, జనవరి 11: పెద్దపల్లి సబ్‌డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలో షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సుల్తానాబద్ సీఐ జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12, 13వ తేదీల్లో సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఈ పోటీలు నిర్వహిస్తామని, క్రీడాకారులకు ట్రోఫీతో పాటు నగదు బహుమతి అందజేస్తామని వివరించారు. పోటీల్లో పాల్గొనేందుకు సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, జూలపల్లి, ఎలిగేడు మండలాల ఆసక్తి గల క్రీడాకారులు 9396540067, 8688010549 సెల్ నంబర్లను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

గట్టెపల్లిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

సుల్తానాబాద్, జనవరి 11: మండలంలోని గట్టెపల్లిలో వ్యవసాయ పంటపొలాలకు సంబంధించిన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తుకెళ్లిన ఘటన గురువారం వెలుగుచూసింది. గట్టెపల్లికి చెందిన ఉపసర్పంచ్ నిర్మల రాజ్‌కుమార్‌తో పాటు చిప్ప లక్ష్మణ్, పసుల రాజు, చంద్రమౌళి తదితరులు మాట్లాడుతూ.. తమ పంట పొలాల కోసం ఏర్పాటు చేసుకున్న రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతె లియని దొంగలు బుధవారం రాత్రి వాటిని ధ్వంసం చేసి వాటిలో ఉన్న విలువైన ఇత్తడి రాగి వైర్లను ఎత్తుకెళ్లారని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశామని ఎస్‌ఐ విజేందర్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారని రైతులు వివరించారు. ప్రసుత్తం తాము నార్లు పోసుకున్నా మని, వాటికి సాగు నీటు అత్యవసరమని విద్యుత్ అధికారులు తమకు వెంటనే నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేయాలని కోరారు.

శ్రీపాద కప్ క్రికెట్ పోటీలు ప్రారంభం

మంథని, జనవరి 11: స్థానిక క్రీడామైదా నంలో సంక్రాంతి సెల వులను పురస్కరించు కొని శ్రీపాద కప్ క్రికెట్ పోటీలను శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ళ శ్రీనుబా బు గురువారం ప్రారం భించారు. కార్యక్రమం లో ఎంపీపీ కొండ శంకర్, కాంగ్రెస్ నేతలు శశిభూషన్‌కాచే, వొడ్నాల శ్రీనివాస్, పెంద్రు రమాదేవీ-సురేష్‌రెడ్డి, ఐలి ప్రసాద్, పోలు శివ, హనుమంతు, నూకల బానయ్య, కుడుదుల వెంకన్న, పేరవేన లింగయ్య యాదవ్ పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సన్మానం

ఎలిగేడు, జనవరి 11 : క్రికెట్‌లో ప్రతిభకనబరిచి గోల్డ్ మెడల్ సాధించిన మండల కేంద్రానికి చెందిన కవ్వంపెల్లి సాయిప్రశాంత్‌ను గురువారం ఎలిగేడులో వైస్ ఎంపీపీ బుర్ర వీరస్వామిగౌడ్ తదితరులు ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ మండిగ రాజనర్సు, మాజీ ఉపసర్పంచ్ గుడుగుల మహేందర్, రంగు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.